క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

డీసీసీ కార్యదర్శి సోమన్‌గుర్తి శ్రీనివాస్



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు

పూడూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని డీసీసీ కార్యదర్శి సోమన్‌గుర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందచేశారు. అర్హులైన ప్రతిఒక్కరూ సీఎం రిలీఫ్ పండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీశైలంగౌడ్, నాయకులు కిష్టయ్య, వెంకటయ్య, నరేశ్, రమేశ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాండూరు టౌన్: 25 ఏళ్ల క్రితం తాండూరు పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో పదోతరగతి (1999–2000) పూర్తి చేసుకుని, ఉన్నత చదువుల కోసం పలు ప్రాంతాలకు వెళ్లారు. చదువులు పూర్తి కాగానే ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నేటి బిజీ ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒకే వేదికపై కలవాలనుకున్నారు. ఆదివారం తాండూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన ఆచార్యులను పిలిచి ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అందరూ చిన్నప్పటి మధుర జ్ఞాపకాలను, పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా స్నేహం ముందు అన్నీ తక్కువేనని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నందున ఇబ్బందులు తలెత్తుతున్నాయిని ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలను వేరొక చోట నిర్మించాలని సంకల్పించామని, అందులో భాగంగానే రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలకు అనుకూలమైన స్థలాలు ఇంకా ఎక్కడ ఎక్కడ ఉన్నాయో చూసి స్థలాన్ని ఎంపిక చేస్తామని వివరించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

అనంతగిరి: జిల్లాలో విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవిప్రసాద్ తెలిపారు. ఇకనుంచి కింద పేర్కొన్న నంబర్లతో విద్యుత్ సేవలు పొందొచ్చని ఆయన పేర్కొన్నారు.

అధికారి హోదా	ఫోన్ నంబర్
ఎస్ఈ వికారాబాద్	8712469715
ఎస్ఏఓ వికారాబాద్	8712469720
డీఈ టెక్నికల్, వికారాబాద్	8712469716
డీఈ, ఆపరేషన్ వికారాబాద్	8712469717
డీఈ ఆపరేషన్ తాండూర్	8712469718
ఏడీ వికారాబాద్	8712469723
ఏడీ పరిగి	8712469724
ఏడీ తాండూర్	8712469725
ఏడీ కొడంగల్	8712469726
ఏఈ వికారాబాద్‌టౌన్	8712469739
ఏఈ వికారాబాద్ రూరల్	8712469740
ఏఈ ధారూర్	8712469741
ఏఈ, మోమిన్‌పేట	8712469742
ఏఈ, మర్పల్లి	8712469743
ఏఈ పరిగి	8712469744
ఏఈ దోమ	8712469745
ఏఈ కుల్కచర్ల	8712469746
ఏఈ మన్నెగూడ	8712469747
ఏఈ చౌడాపూర్	8712469748
ఏఈ తాండూర్ టౌన్	8712469749
ఏఈ తాండూర్ రూరల్	8712469750
ఏఈ పెద్దెముల్	8712469751
ఏఈ బషీరాబాద్	8712469752
ఏఈ దుద్యాల	8712469753
ఏఈ యాలాల	8712469754
ఏఈ బంట్వారం	8712469755
ఏఈ బొంరాస్‌పేట	8712469756
ఏఈ కొడంగల్	8712469757
ఏఈ దౌల్తాబాద్	8712469758
ఏఈ కోట్‌పల్లి	8712469759
వికారాబాద్ కంట్రోల్ రూం	8712469839

డేటా ఎంట్రీ.. బిల్లుల సంగతేంటి?

ఎనిమిది నెలలు కావస్తున్నా విడుదల చేయని నగదు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కంప్యూటర్ ఆపరేటర్లు
- పట్టించుకోని అధికారులు



కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ (ఫైల్)

కుల్కచర్ల: సంక్షేమ పథకాల ఫలితాలు సబ్బండవర్గాలకు అందాలన్న సంకల్పంతో రాష్ట్రంలో ఏ కులం వారు ఎంత శాతంగా ఉన్నారో తెలుసుకోవడానికే కుల జనగణనను చేపట్టారు. దీనికోసం ప్రతీ కుటుంబ వివరాలు సేకరించారు. అందుకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి ఉపాధ్యాయులతో సర్వే నిర్వహించారు. పూర్తయిన వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయించేందుకు ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుని డేటా ఎంట్రీ చేయించారు. నేటికి 8నెలలు కావస్తున్నా వారికీ రెమ్యూనరేషన్ విడుదల చేయలేదు. ఈ విషయంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

44 గ్రామపంచాయతీల్లో..

కుల్కచర్ల మండల పరిషత్‌లో 44 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో 11,942 కుటుంబ వివరాలను ఆన్‌లైన్లో ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేశారు. ఈ విషయంలో ఇద్దరు ప్రభుత్వ సిబ్బంది మినహా, కంప్యూటర్ ఆపరేటర్లను తాత్కాలిక పద్ధతిన ఏర్పాటుచేసుకుని గ్రామపంచాయతీల వారీగా డాటా నమోదు చేయించారు. ఒక్కో ఫాంను ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్‌కు రూ.30లుగా అధికారులు పేర్కొన్నారు. 11,942 కుటుంబాలకు గాను ఆపరేటర్లకు 3,58,260 డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు ఆ డబ్బులు ఆపరేటర్లకు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లోనే..

జిల్లాలో 18మండల పరిషత్‌లు, 4మున్సిపాలిటీలలో కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 2,43,487 కుటుంబ వివరాలను ఆన్‌లైన్లో ఎంట్రీ చేశారు. సుమారు ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వ సిబ్బందికి రూ.15లు, ప్రైవేటు ఆపరేటర్‌కు రూ.30ల చొప్పున ఇవ్వాల్సి ఉంది. దీంతో వారికి రావాల్సిన మొత్తం రూ.73,04,610లుగా బకాయి ఉంది. వాటిని ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

చర్యలు తీసుకోవాలి



సర్వే వివరాలు నమోదు చేసేందుకు, ఒక్కో కుటుంబ వివరాలను రూ. 30ల చొప్పున ఇస్తామని పేర్కొనడంతో పాటుగా 2నెలల్లో పూర్తిగా చెల్లిస్తామని చెప్పారు. కాని 8నెలలు గడిచినా చేసిన పనికి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వలేదు. జిల్లా అధికారులు స్పందించి డేటా ఎంట్రీ చేసిన వారికి త్వరగా విడుదల చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– రమేశ్, కంప్యూటర్ ఆపరేటర్, కుల్కచర్ల

త్వరలో మంజూరవుతాయి



డేటా ఎంట్రీ నిర్వహించిన ఆపరేటర్లకు బిల్లుల చెల్లింపు ప్రక్రియను పూర్తిచేసి జిల్లా అధికారులకు అందజేశాం. రాష్ట్ర స్థాయిలో ట్రెజరీలోనే పెండింగ్‌లో ఉండటంతో ఆలస్యమైంది. త్వరలో నేరుగా ఆపరేటర్ల ఖాతాల్లో జమ అవుతాయి.

– రామకృష్ణ, ఎంపీడీఓ, కుల్కచర్ల



బంట్వారం: బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న నాయకులు

ఆర్థిక సహాయం అందజేత

కుల్కచర్ల: నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కిన్నెరి రాములమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి స్థానిక నేతలతో కలిసి బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమయ్య, చంద్రయ్య, సోమలింగం, భాస్కర్, యాదయ్య, మైసయ్య, రాజు, శివ, శ్రీను, సాయన్న, నర్సింలు, పెద్ద క్రిష్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఈడ్గి సాయిల్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ ఆదివారం సంతాపం ప్రకటించారు. అలాగే మృతుడి కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల ద్వారా పంపించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు హుస్సెన్, వీరేశం, హాశం, కిష్టయ్య, రాజు, నర్సింలు, ప్రకాశ్, పెంటయ్య, దత్తు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



గెలుపొందిన క్రీడాకారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషిచేస్తామని మద్దూరు మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరేందర్‌రెడ్డి, మాజీ సహకార సంఘం డైరెక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మద్దూరులో దివంగత నేత పట్లోళ్ల లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గత 15 రోజులుగా ఎంపీఎస్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి హైదరాబాద్ సన్‌రైజర్ జట్టుకు రూ.1 లక్ష నగదు, రెండో బహుమతి ముంబాయి జట్టుకు రూ.25వేల నగదు, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి, గెలుపునకు నాంది కావాలన్నారు. కార్యక్రమంలో కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవినాయక్, నాయకులు సుధాకర్‌గౌడ్, బాల్‌రాజ్‌యాదవ్, విగ్నేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఇళ్లు లేని నిరుపేదల కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులకు శ్రీకాంత్‌రెడ్డి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఆహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, నాయకులు సురేష్‌గౌడ్, హరికృష్ణయాదవ్, సాయికుమార్, రమేశ్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, అశోక్, గోదా రమేశ్, మాధవి, సునీత, గణేష్, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్, శంకరయ్య, రవిచారి, మల్లేశ్‌గౌడ్, గణేష్, సిద్ది రవితేజ, శ్రీధర్, ప్రతాప్ రెడ్డి, దాదిమియా, రాంచంద్రయ్య, బుచ్చయ్య, బక్కని శ్రీను, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘సైనికులను అవమానించడం బాధాకరం’

మొయినాబాద్‌రూరల్: సైనికులను అవమానించడం బాధాకరమని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ ఎలగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. భారత సైనికులను అవమానపరిచేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సరికాదన్నారు. దేశ సమగ్రతను నిలబెట్టే సైనికుల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే ఇతర నాయకులు అవమానించేలా హేళన చేస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు పార్టీలు ముఖ్యం కాదని అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే సైనికులకు ధైర్యం నింపగలుగుతామన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుకు మాతృవియోగం

దోమ: మండల పరిధిలోని బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకొన్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోపాల్ గౌడ్ పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశిధర్ రెడ్డి, పవన్ యాదవ్, డప్పు రమేశ్, శ్రీనివాస్, షేర్‌ఖాన్, అనంతయ్య, మోహిన్ పాషా, బొక్క పాషా, బాలరాజ్, నరేందర్, నరేశ్, శ్రీనివాస్, మల్లేషం, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అందరికీ సముచిత న్యాయం

యాలాల: కాంగ్రెస్‌లో అందరికీ సముచిత న్యాయం కల్పిస్తూ, పార్టీ పటిష్టతకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి చేస్తున్నారని యాలాల మండల అధ్యక్షుడు మేడికొండ నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..పార్టీలో పాత నాయకులకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. ఇటీవల చేపట్టిన నామినేటెడ్ పదవులతో పాటు అన్ని అంశాల్లో పాత నాయకులకు సరైన అవకాశం కల్పించారన్నారు. గత ఎన్నికల్లో పాత, కొత్త నాయకులతో పార్టీ పటిష్టతకు కృషి చేశామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత నాయకులకు తగిన గుర్తింపు ఇస్తూ పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంతృప్తికరంగా పదవుల పంపకాన్ని చేపట్టారని స్పష్టం చేశారు. ఈ విషయంలో చేస్తున్న దుష్ప్రచారాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు నమ్మొద్దని సూచించారు.

యువకుడి మృతి బాధాకరం

దోమ: యువకుడి మృతి బాధాకరమని భాజాపా జాతీయ కార్యవర్గ సభ్యుడు పహ్లాద రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు (భారాస) వెంకటనాగిరెడ్డి పేర్కొన్నారు. దోమ మండలం దొంగ ఎన్కెపల్లికి చెందిన మాజీ సర్పంచి కృష్ణయ్య కుమారుడు లోకేశ్ (22) వారం క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకొని వారు ఆదివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి యువకుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలతో పేదలకు మేలు

తాండూరు రూరల్: కంటి వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని ఎల్ఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకుడు లొంక నర్సిములు పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎల్ఎస్ఆర్ యువసేన, శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 50మందిని ఆపరేషన్ నిమిత్తం హైదరబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్, యువసేన సభ్యులు సంగమేశ్వర్, లొంక రాములు, వెంకట్, విజయ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సిములు



దారువాగు తండాలో నూతన బోరు వేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గిరిజన తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సిములు పేర్కొన్నారు. ఆదివారం దారువాగు తండాలోఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవికాలం వచ్చిందంటే తండాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో మండలానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.70లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో, తండాల్లో నూతనంగా బోర్లు వేయించి పైప్‌లైన్ ద్వారా ట్యాంకులకు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. మిషన్ భగిరథ నీటి సరఫరా నిలిచిపోయినా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మన్యానాయక్, యూత్ ప్రెసిడెంట్ మహేశ్, పరుశురాం, సురేశ్, మోహన్‌సింగ్, రాంరెడ్డి, రవీందర్, మోహన్, నరేష్, శివరాజ్, గోపాల్, పూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- అల్లాపూర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం



ఎమ్మెల్యేతో అల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు యాదప్ప గౌడ్ తన అనుచరులతో ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మనోహర్‌రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాండూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తన గెలుపు కోసం పని చేసిన కార్యకర్తను గుండెలో పెట్టుకుంటానన్నారు. కార్యకర్తలు లేనిది పార్టీ లేదన్నారు. తనకు గుర్తింపు ఇవ్వడం లేదని యాదప్ప కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఈ విషయం గురించి యాదప్పతో పాటు అనుచరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా పిలిచి మాట్లాడారు. ఇక నుంచి యాదప్పకు పార్టీతో పాటు ప్రభుత్వ పథకాల్లో తగిన గుర్తింపు ఇస్తానన్నారు. యాదప్పతో పాటు వారి అనుచరులకు అండగా ఉంటానని భరోస ఇచ్చారు. అల్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, ఎస్సీ కాలనీలో మురుగు కాల్వ, వివేకానంద విగ్రహం నుంచి అల్లాపూర్ గేటు వరకు సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, వీరప్పగౌడ్, రమేశ్, శ్రవణ్, మోహన్, నారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి



అంతారంలో మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమని కుల్కచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం అంతారం గ్రామంలోని 117వ పోలింగ్ బూత్‌లో మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత్ యుద్ధ తంత్రం, సైనిక బలం ప్రపంచం తెలుసుకునేలా ఉగ్రవాదులను అంతమొందించడంలో ప్రధాని తీరు అభినందనీయమన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే అరాచక శక్తులు భయపడేలా భారత సైన్యానికి స్వేచ్ఛనిచ్చి ముందుకు నడిపించారని గుర్తు చేశారు. దేశ రక్షణలో ఎలాంటి ఆలోచనలు లేకుండా సైన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రోత్సహించి వారికి అవసరమైన మనోబలాన్ని ఇవ్వడంలో మోదీ ప్రతిష్ఠ మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు మైపాల్, మండల ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్, హన్మంతు, ఉపాధ్యక్షుడు కొండ ఆంజనేయులు, నాయకులు వెంకటేష్, గోపాల్, హన్మయ్య, మైపాల్ రెడ్డి, అశోక్, అంజిలయ్య, శ్రీకాంత్, మల్లేశ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు



షాద్‌నగర్: ప్రధాని మోదీ ప్రసంగాన్ని టీవీలో చూస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణంలో బీజేపీ నేతలు టీవీల్లో వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగంలో పలు జాతీయ ప్రాధాన్యత గల అంశాలను వివరించారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, డ్రోన్ సాంకేతికతను వాడుతూ మహిళలు వ్యవసాయం చేయడాన్ని వివరించారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌లో మేడిన్ ఇండియా సాంకేతిక విజయం, రాజకీయాల్లో మహిళల పాత్రపై ప్రధాని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ప్రధాని ప్రసంగాన్ని బీజేపీ నేతలు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. అదేవిధంగా మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తాతో పాటుగా పలువురు నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు హరిభూషణ్, మురళీ, నర్సింలు, కుర్మయ్య, ప్రశాంత్, మనోహర్, అంజయ్యగౌడ్, గిరి, శివ, ఆనంద్, మహేశ్, బాబు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: ప్రధాని మోదీ నేరుగా ప్రజలతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన మన్‌కీబాత్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ప్రధాని మోదీ 122వ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నేరుగా ప్రజలతో ప్రజల సమస్యలను తెలుసుకోవటం గొప్ప విషయమన్నారు. అలాంటి నాయకుడు మనకు ఉండటం అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

డివైడర్ల మధ్య విద్యుత్ లైట్లేవీ?

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



లైటింగ్ లేని కోట్‌పల్లి మెయిన్ రోడ్డు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డుపై డివైడర్స్ ఏర్పాటు చేశారు. కాని విద్యుత్ స్తంభాలతో లైటింగ్స్ పనులు చేపట్టలేదు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. నాలుగేళ్ల కిందట రూ.25లక్షలతో డివైడర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విద్యుత్ స్తంభాల జాడేలేదు. మెయిన్ రోడ్డు గుండా రాత్రి వేళల్లో వాహనదారులు ప్రయాణం చేయాలంటే జంకుతున్నారు. మిణుకు..మిణకు మంటూ ఎదురెదురుగా వచ్చే వాహనాల లైట్లతో కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు

తాండూరు–సదాశివపేట నేషనల్ హైవేకు కోట్‌పల్లి మీదుగానే నిత్యం వందలాది భారీ వాహనాలు తిరుగుతుంటాయి. బస్టాండ్‌లో కొంత దూరం వస్తే ఉన్నప్పటికీ రోడ్డు ఇరుకుగానే కనిపిస్తుంది. డివైడర్లు పెట్టడంతో మూలమలుపులు మరింత చిన్నపాటిగా తయారయ్యాయి. గతంలో తాండూరు వైపు వెళ్తున్న ఓ స్విఫ్ట్ కారు అదుపు తప్పి దుకాణంలోకి చొచ్చుకుపోయింది. షెటర్ మూసి ఉండడంతో అక్కడ ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. కారు మాత్రం రోడ్డుపై పల్టీ కొట్టింది.

బస్సులు వెనక్కి తిప్పడంలో ఇబ్బందులు

రోడ్డు మధ్యలో డివైడర్లు పెట్టడంతో ఆర్టీసీ బస్సులను వెనక్కి తిప్పడం డ్రైవర్లకు కష్టంగా మారింది. వికారాబాద్–కోట్‌పల్లి లోకల్ బస్సులు బస్టాండ్ దగ్గరే రిటర్న్ అవుతాయి. అక్కడే ప్రైవేటు వాహనాలు నిలిపి ఉంచుతారు. ఇరువైపులా రోడ్డు ఇరుకుగా మారడం, మధ్యలో డివైడర్లు పెట్టడంతో బస్సులను వెనక్కి తీయడం డ్రైవర్లకు కష్టంగా మారింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి అవసరమైన మేరకు విద్యుత్‌లైట్లను ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.